చుట్టూ తిరగలేక బాధలుపడ్డారు. చివరకు అనేక మంది కొందరు కాంగ్రెసువాదులకు లంచాలు యిచ్చి ఆర్డర్లను రద్దు చేయించుకున్నారు. ఈ విధంగా ప్రతి గ్రామాన కాంగ్రెసు వ్యతిరేకత బలిసింది. దీనికి ధాన్య సేకరణకు పోలీసుజులుంకు కూడా చేర్చినప్పుడు, ఆంధ్రదేశం మొత్తం మీద ఈ నాలుగు కారణాలవల్లనే కాంగ్రెసు దెబ్బ తిన్నదని చెప్పవచ్చు. ప్రజాస్వామ్య దృక్పథం లేనందునే ఇవిఇంతగా విషమరూపం దాల్చినవని విశ్వశించవచ్చు.

ప్రభుత్వంలోవున్న కాంగ్రెసువాదులుకూడా ప్రజాస్వామ్య దృక్పథంతో వ్యవహరించనందునే అనవసరంగా కొన్ని పంచాయతీబోర్డులను రద్దు చేశాడు. కొన్ని సహకారసంఘాలను కట్టివేయించారు. ప్రభుత్వంద్వారా కొందరికి ఉద్యోగాలు యిచ్చారు. ప్రభుత్వంద్వారా కొందరికి త్వరగా ఆర్థికసహాయం వగైరాలు చేశారు. అందువల్లనే కాంగ్రెసుమంత్రులు `వోడిపోవడం కొందరు కాంగ్రెసువాదులకుసంతోషంకలిగించిందికూడా.

ఎవరు ప్రజా ప్రతినిధులో నిర్ణయించేవారు వోటర్లు. కాని ఆ ప్రతినిధులలో ఫలానావారు మా ప్రతినిధి అని చెప్పవలసిన బాధ్యత ఆయా పార్టీలది. ఇలా చెప్పడంలోకూడా కాంగ్రెసు పార్టీ ప్రజాస్వామ్యవ్యతిరేక దృక్పథంతో నడిచింది. కనీసం ఆయా నియోజక వర్గాలలోని కాంగ్రెసు కార్యకర్తల ఏకాభిప్రాయాన్ని కాకపోయినా మెజారిటీ అభిప్రాయాన్ని కూడా తెలుసుకోనక కొందరు కాంగ్రెసు నాయకులు చేరి ఇష్టంవచ్చినట్లు, అభ్యర్థులను నిర్ణయించారు. ఈ నిర్ణయాలు ముందుగా కాంగ్రెసు కార్యకర్తలలో అసంతృప్తి తెచ్చినవి. అందువల్లనే గత ఎన్నికలలో కాంగ్రెసు ఆర్గనైజేషన్ పని చేయలేదు. ఆ తరువాత కాంగ్రెసు అభ్యర్థి అయిన వ్యక్తి ప్రజల దృష్టిలో ఒక సంస్థ ప్రతినిధిగా కాక కొన్ని దుశ్చర్యలకు మూలంగా కనిపించాడు. అయిదేండ్ల కాంగ్రెసు పాలనలో జరిగిన లోపాలకు ఈ ప్రతినిధే బాధ్యుడన్న ధోరణి ప్రజలలో వ్యాపించింది. అదే కాంగ్రెసు అభ్యర్థిగా వున్న వ్యక్తి ఎంత గొప్పవాడైనా సరే నైతికంగా దెబ్బతీసింది. చివరకు పెద్దపెద్ద కాంగ్రెసువాదులుకూడా ప్రజలముందు ధైర్యంగా నిలబడలేకపోయారు. కాంగ్రెసు సభ్యత్వంనుంచి కార్యకర్తల నిర్ణయంనుంచి, అభ్యర్థుల ఎన్నికనుంచి, ప్రభుత్వంలో అమలు జరిపించిన విధానాల నుంచి ప్రజాస్వామ్య దృక్పథం అనేది దూరంకావడం, చిత్తశుద్ధితో వ్యవహరించకపోవడం, సంస్థకోసం కాక వ్యక్తులకోసం పని చేయడంవల్ల ప్రజాశక్తి విజృంభణకు కారకులైన కాంగ్రెసువారు చివరకు ఆ శక్తి స్వరూపాన్ని తేరిపార చూడలేకపోయారు.

స్కెచ్

# ఉదారలోకం ఊహలో—

పావనరాం

మార్కెట్లోంచి కూరల సంచితో ఇవతల పడ్డాను. అప్పుడే ఎనిమిది దాటింది. ఎండ చిరచిర లాడుతోంది. ముఖాన్ని పట్టిన చెమట తుడుచుకుంటూ, సిటీబస్సు కోసం ఎదురు చూస్తున్నాను.

నాలాగే బస్సుకోసం కాచుక్కూర్చున్న వాళ్ళ సంఖ్య క్రమంగా ఎక్కువవడం ప్రారంభించింది. అక్కడ కాస్తంత నీడగల చోటే కరువయింది. పావుగంట దాటినా బస్సు-పత్తాలేదు. అయినా ఈమధ్య సిటీబస్సులతో మాచెడ్డ అవస్థగా ఉంది. వాట్లకో టైం అంటూ ఏడవదు! ఎవరో అన్నట్లు... వాట్ల రాకపోకలు "దైవాధీనం".

"బాబూ! రెండురోజుల్నుంచీ కుర్రాడివళ్ళు కాలిపోతోంది. నాలుగు డబ్బులిప్పించండి మా రాజా! డాక్టర్ బాబుకి చూపించుకుంటాను." అంటూ ఓ గొంతుక వినపడసాగింది. ఆ మనిషిని చూద్దామంటే—ఆమె ప్రాధేయ పడుతున్న షావుకారిగారి వీపు అడ్డుగా ఉంది.

షావుకారుగారు అంటున్నారు. "రోజూ

వచ్చే రోగమేగా! అదే తగ్గుద్దిలే! మరేం బెంగ పడక..."

దాంతో ఆ మనిషి ఇంకొర్కి సమీపించింది.

తల పూర్తిగా రేగి ఉంది. వయస్సు పాతిక సమీపంలో ఉండవచ్చు. తిండిలేక చిక్కినట్లు ముఖం చెప్తోంది. ఒక మాసిన గుడ్డతో తనపిల్ల వాణ్ణికప్పి గట్టిగా హృదయానికి హత్తుకొనివుంది.

ఆఖరకి నాదగ్గరకి వచ్చింది. "నాలుగు డబ్బులిప్పిస్తే మందు కొనుక్కుంటా"నంది.

నేనేం మాట్లాడలేదు.

ఆమె నా ముఖంలోకి చూసింది.

"నిజంగా జబ్బేనా?"అని అని అనుమానిస్తున్నట్లనిపించింది లాగుంది. పిల్లవాని ముఖం చూపింది. వాడు కళ్లు మూసుకొని గురక పెడుతున్నాడు. ముఖం అంతా ఉబ్బి ఉంది, అప్రయత్నంగా నేను నా అరచేతి వెనక భాగాన్ని వాడి బుగ్గమీద వేసాను. ఒళ్ళు కాలిపోతోంది.


పదిరోజుల క్రితమే పోయిన నా "బాబు" గుర్తు కొచ్చాడు. దగ్గుని నిర్లక్ష్యం చేయడం చేత పీకలమీద కొచ్చింది. ఆఖర్కి డాక్టర్‌కి చూపితే "ఇపుడేం లాభం లేద"న్నాడు. ఆ మాటలు నా చెవుల్లో ఇంకా గింగురు మంటున్నయ్.

నా ప్రవర్తన చూసి. ఏమైనా ముట్టుచెప్తానను కుందిలాగుంది, అంతా ఏకరువు పెట్టింది.

"రెండుమూడు రోజులనుంచి ఒకటే గొడవ బాబూ! డాక్టర్ ఐదురూపాయలు పెట్టేనే కాని మాట్లాడనన్నాడు. ఇప్పటికో రెండురూపాయలు పోగయ్యాయ్!" అంది.

నేను ఈమెతో ఆప్తబంధువుతో మాట్లాడుతున్నట్లు తోచింది కాబోలు ఆ షాహుకారు నావేపు మాటిమాటికి వేలుచూపుతూ పక్కాయనతో ఏదో అంటున్నాడు.

"డాక్టరేమిటి? ఆస్పత్రిలో చేర్పించరాదూ? చివరవరకూ ఊరుకొని అప్పుడు తీసికెళ్తే ఏం ప్రయోజనం ఉండద"న్నాను.



"అక్కడ నా ముఖం చూచేవాళ్ళెవరు బాబూ!" అంది.

"నే తీసికెళ్తా వస్తావా?" అన్నా.

ఆమె కృతజ్ఞతతో రెండు చేతుల్తోటి దండం పెట్టింది

ఇంతలో బస్సు వచ్చింది బస్సు ఎక్కాం.

* * *

కండక్టర్ డబ్బడిగాడు నాకూ, ఆమెకీ అని అర్ధరూపాయి ఇచ్చాను. వాడు నాముఖం, ఆమె ముఖం రెండుమూడుసార్లు చూశాడు. "చిల్లర లేదు. రెండునిముషా లాగండ"న్నాడు.

"ఆస్పత్రి గేటు"లో బస్సు ఆగేలోగా ఆ కండక్టర్ కనీసం ఓ అరడజను సార్లేనా చూసి ఉంటాడు నాకేసీ ఆమెకేసీ.

కండక్టర్ ఇచ్చిన చిల్లర డబ్బులు జేబులో వేసుకుంటూండగా నా పక్కాయన అవతలాయన చేయి గోకుతూ ఏదో గొణుగుతున్నాడు. ఆ రెండోమనిషి నాముఖం కనపడేలాగ వంగి పల్లికిలించాడు. బస్సాగింది.

* * *

బస్సుదిగి ఆస్పత్రివేపు నడిచాం. బయట "ఆ మనిషి"ని నిలబెట్టి లోపలకి వెళ్ళాను. అరగంట తర్వాత ఇవతల కొచ్చాను.

అప్పటికప్పుడే తొమ్మిదిన్నర అయింది. మా ఆఫీసులోనే పనిచేస్తున్న మూర్తి ఆదారెంట వెళ్తున్నాడు. పిలిచి కాగితం అడిగి సెలవు దరఖాస్తు రాశాను.

"ఏంకథ?" అన్నాడు.

విషయమంతా చెప్పాను.

"గుడ్ లక్" అని వెళ్ళిపోయాడు.

ఆమె అక్కడే బితుకు, బితుకు మంటూ నుంచుంది. లోపలికి రమ్మని తీసికెళ్ళి, వరండాలో కూర్చోవున్నాను.

ఆవార్డు డాక్టరు "బెడ్స్ ఖాళీలేవ"న్నాడు. "ఎల్లాగేనా ప్రయత్నించండ"ని ప్రాథేయ పడ్డాను. ఆయన పైకివచ్చి తీసుకొచ్చి నామె పిల్లవాణ్ణి చూశాడు.

లోపలికెళ్ళి ఓ అరగంట తర్వాత పక్కవార్డులో "ఎడ్మిట్" చేయమని కాగితంరాసిచ్చాడు.

* * *

నేనాయనకి "థాంక్స్" చెప్పడానికి ఆయన గదిలోకి వెళ్ళాను.

ఆయన అడిగారు "ఆమె మీకేమవుతుందండీ?"—అని.

ఓ నిముషం ఏం చెప్పడానికీ తోచలేదు. "నాకెవరకేమీ తెలియదండీ! పిల్లవాడికి జ్వరం తీవ్రంగా ఉంది సాయంచేయమంటే తీసుకొచ్చాను"అన్నాను.

ఆయనో చిరునవ్వుపారేసి,"దట్స్ ఆల్ రైట్, గెట్ ఎలాంగ్"అన్నారు.

* * *

ఆ పిల్లవాణ్ణి ఎడ్మిట్ చేసిన వార్డులోకి వెళ్ళాను. అతడు మంచంమీద పడుకొని ఉన్నాడు. "వెళ్తా"నని చెప్దామనుకున్నాను. కాని ఎందుకో తెలియకుండానే నాకాళ్లు నన్ను "ఆస్పత్రి" "అవుట్ గేట్"దగ్గర పడేశాయి. పన్నెండున్నర అయింది. చేతిలోని సంచీలో తోటకూర వాడిపోయింది.

* * *

ఓ సాయంత్రం ఏమేనా అవసర ముంటుందేమో రెండు రూపాయ లిద్దామని వెళ్ళాను.

"వే ఇన్" దగ్గరికి వెళ్ళగానే—

"ఆమె మీకేవు మందన్న" డాక్టరు మాటలు జ్ఞాపకమొచ్చాయి!

షావుకారి చూపులు, కండక్టర్ ముఖం, నా పక్కాయన ఇగిలింపు, మా మూర్తి అన్న "గుడ్ లక్" వరసగా జ్ఞాపకమొచ్చాయి.

"ఔను, ఆమె నాకే మవుతుందని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. బరువైనహృదయాన్ని, తేలికకాళ్లు బీచ్ గాలుల్లోకి తీసుకెళ్ళాయ్.

మీరు సర్వదా అహింసావాదులనీ, శాంతస్వభావులనీ నమ్మకం కలిగి ఉంటే, ఎప్పుడైనా ఒక ధనవంతుడయిన రాజకీయ నాయకుడు–బీదవారు తక్కువ ఆదాయంతో ఎలా సుఖంగా బతకవచ్చో వివరిస్తూ చెప్పే ధర్మోపన్యాసాలు ఎప్పుడూ వినలేదన్న మాట.